# సూరిగాడి మొక్కు

"రాస్కెల్ అమ్మగారితో ఏమిట్రా చెప్పావ్!" బూటుకాలితో నడుంమీద ముందుకు తూలిపడేలా తంతూ అడిగాడు భార్యని బస్సెక్కించి వచ్చిన మేనేజరు పాంచజన్యరావు. సూరిగాడు బిత్తరపోయి కంగారుగా లేచి నిల్చుని "లేదండి నేనేం చెప్పలేదండి. ఒట్టండి. దేవుడిమీద ఒట్టండి." అన్నాడు

"నువ్వు కాక పోతే ఎవరు? చెప్పారు- చంపేస్తాను వెధవా?" అని జుట్టుపట్టుకుని ఆ చెంపా ఈ చెంపా వాయించేశాడు పాంచజన్యరావు.

సూరిగాడి లేత చెంపలు ఎఱ్ఱగా కంది పోయాయి. చెక్కిళ్ళమీదనుంచి కన్నీటి బొట్లు జలాజలా రాలిపోతూంటే చెపాతీలు చేస్తూన్న పిండి చేత్తో ఆనీళ్లు తుడుచుకున్నాడు సూరిగాడు. అతని ముఖానికి జిడ్డు, పిండి అంటుకున్నాయ్. సర్దుకుని పులిముఖంతో మింగేట్టు తనవైపు చూస్తున్న పాంచజన్యరావువైపు బెదురు బెదురుగా చూస్తూ "ఏంటండి ఏటిచెప్పానండి?" -అడిగాడు.

అమ్మగారు వచ్చి వారంరోజులుంది. అమ్మగారున్నరోజుల్లో వాడికి పని మరీ ఎక్కువయింది. కడిగిన గిన్నే మళ్ళీ కడగడం. గది పదిసార్లు చీపురుతో వూడవటం, తడిగుడ్డతో తుడవటం, తర్వాత అమ్మగారు వంట చేస్తూన్నంత సేపు మసాలా రుబ్బటం, కూర తరగడం, ఒకటి ఏమిటి! ఆమె స్టౌముందు

## కవితిపాటి విజయలక్ష్మి

పీటమీద కూర్చుని వంట మొదలు పెడితే బొంగరంలా తిరగడమే వాడు ఒక్కడే ఉండేపద్దయితే అయ్యగారికి కావలసిన స్ట్రాంగ్ టీ తనూ ఓకప్పు తాగేస్తాడు, కావాలంటే మరోసారి కలుపుకుంటాడు అయ్యగారికి వరాలు చిక్కని పాలే పోసుంది. అమ్మగారు వచ్చిన దగ్గరనుంచీ రంగునీరులాంటి టీ. మిగిలినరోజు పిడికెడు అన్నం-అంతే ఆమె తొందరగా వెళ్ళిపోతే బావుణ్ను అనుకుంటున్నాడు. అయ్యగారి అన్నానికి డొక్కునన్నగ బియ్యం కడిగి పెట్టేస్తాడు. ఆ అన్నం అయ్యగారికీ వాడికీకూడా సరిపోతుంది. ఒక్కోసారి పెరట్లో చింతచెట్టుక్రింద పడుకునే కుక్కక్కూడా ఓముద్ద పడేస్తాడు. అది వాడు వాకిట్లో అన్నం పెట్టేసరికి తోక ఊపుకుంటూ, నాలిక చప్పరించుకుంటూ వాడి వెనక వెనకే తిరుగుతుంటుంది.

ఆయ్యగారికి తరుచుగా గుమాస్తాల ఇళ్ళనుంచి, వీడిది ఇంటినుంచీ కూరలు పప్పులు, పిండివంటలూ వస్తూంటాయి. ముందుగా సూరిగాడే రుచిచూస్తాడు. వాడు అసలు జీవితకాలమంతా అయ్యగారితోటే ఉండిపోవాలనే నిశ్చయానికి వచ్చాడు.

కాని ఎప్పుడూ "ఒరె సూరిగా!" అని ఆప్యాయంగా పిలిచే అయ్యగారు ఇలా ఇంత గట్టిగా చెంపలు పగల గొట్టడంతో ఆమోమయంలో పడిపోయాడు సూరిగాడు.

"ఏంటి చెప్పావా? వెధవా? తెలియదూ!" మరో చెంపకాయి.

చెంపలు మండి పోతున్నాయి సూరిగాడికి "నిజమండి నాకేటి తెల్దండి, నేను అమ్మగారికి ఏటీ సెప్పలేదండి, పీటమీద ఒట్టండి" అన్నాడు.

"డొక్కుచించేస్తాను. చెప్పు అమ్మగారికి చెప్పినది నువ్వేనా?"

"ఏటండి ఏటి సెప్పానండి?" అమాయకంగా మళ్ళీ అడిగాడు సూరిగాడు. అయ్యగారు తాగటం, అబద్ధాలు ఆడటం, లంచం పుచ్చుకోడం, తనకి ఇష్టం కాని వాళ్ల పట్ల ఓలాగ, ఇష్టమయిన వారి పట్ల ఓలాగ ఉద్యోగ ధర్మంలో కూడా వ్యవహరించటం తప్పుకాదు. కాని అతని తప్పులు ఎవరన్నా ఎత్తిచూపటం తప్పు. అతనికి సంబంధించిన వాళ్ళకి చెప్పటం అంతకన్నా తప్పు.

"నువ్వావిడకి ఏమిటి చెప్పావో! అది ముందు నా నోటిమీదుగా రావాలి! వెధవా-నువ్వు చెప్పావని నాకు తెల్సు. నీకు కాకపోతే ఇంకెవరికీ నా విషయాలు తెలియవు. చెప్పు అమ్మగారి దగ్గర ఏమిటి కూశావు?"

తెల్ల ముఖం వేశాడు సూరిగాడు. వాడు చెప్పకూడని అయ్యగారివిషయాలు ఏం చెప్పాడో జ్ఞాపకం రావటం లేదు అమ్మగారు చెప్పారో లేకపోతే రెండు మూడు సార్లు ఊరు వచ్చి ఒకటి రెండు రోజులుండి వెళ్ళిపోయిన అమ్మగారు రెండు నిక్కర్లు రెండు చొక్కాలు తనకు తెచ్చి ఇచ్చింది "వాళ్ళ పిల్లలవి గావాల్ను పాతవి చింకిలు జాగ్రత్తగా కుట్టి మరీ ఇచ్చింది.

అమ్మగారికి తనంటే అభిమానం అనుకుని చాలా సంతోషించాడు. ఆవేళ అమ్మగారడిగిన ప్రశ్నలన్నిటికీ నిక్కరు చొక్కాలు చూసి మురిసిపోతూ దాపరికం లేకుండా జవాబులిచ్చాడు అప్పు

డేమిటడిగింది. తనేం చెప్పాడో గుర్తు రావటం లేదు సూరిగాడికి, గుర్తు తెచ్చుకోవటానికి టైమివ్వటం లేదు పాంచజన్యరావు చెప్పు చెప్పు అని ఒకటే



అదర గొట్టేస్తున్నాడు.

"నువ్వుకాపోతే ఎవర్రా చెబుతాడు అమ్మగారికి అవాకులూ చెవాకులూను? నీకెన్ని సార్లు చెప్పాను! ఇక్కడ జరిగేవేమీ అమ్మగారికి చెప్ప కూడదని రాస్కెల్ - అగ్గి రాజేసేవు కదరా!"

కాలెత్తి సూరిగాడి గుండెల మీద తన్నాడు పాంచజన్యరావు.

వెనక్కి పడి లేచి కూర్చుంటూ, ఏదో చెప్పాలి లేపోతే అతను తనను చంపేస్తాడనే భయంతో వణికిపోయేను సూరిగాడు "నాను కాదండి అమ్మగారితో మాట్లాడింది" అన్నాడు.

"మరెవర్రా?" కసురుకున్నాడు పాంచజన్యరావు.

"ఆవిడకి చెప్పగూడదుమరి" చూపుడు

వేలూపుతూ అన్నాడు సూరిగాడు.

"చెప్పను చెప్పు. అమ్మగారితో నా మీద చాడీలు ఎవరు చెప్పారు?" వాణ్ణి చూస్తే నవ్వొచ్చిందతనికి.

"మా అయ్యేండి'' అనేశాడు చప్పున సూరిగాడు. నిజానికివాడికి అమ్మగారితో చెప్పకూడని విషయాలు ఏమిటో తెలియదు. ఓసారి పాంచజన్యరావు చెప్పాడు తెల్లవార్లూ పేకాట ఆడినప్పుడు "ఒరె సూరిగా నేను నిద్రలేకుండా పేకాడానని అమ్మగారు వచ్చినప్పుడు చెప్పకూడదు సుమా!" అని అర్థరూపాయి ఇచ్చాడు. కూడా

అలాగే చెప్పనని తలఊపాడు. అమ్మగారున్న రోజుల్లో తప్ప మిగతా రోజుల్లో తాగుతాడతను అనితెలుసు సూరిగాడికి. సర్వేశ్వరావు షాపులో బ్రాందీ సీసా తనే కొని తెస్తాడు.


రోజూ సాయంత్రం పాలచెంబుతో వస్తుంది వరాలు. మరో రాత్రి సూరిగాడు ఇంటికి పోయేముందు ముస్తాబయి వస్తుంది. అది రాగానే "ఒరె సూరి ఇంటికిపోరా! నే అన్నం వడ్డించుకు తింటాలే నువ్వుపో"అని తొందర చేస్తాడు అయ్యగారు అతను రొట్టెలకి బదులు అన్నం అంటున్నాడని నవ్వుతాడు సూరిగాడు. వెధవా అని వాడితలమీద మొట్టి రొట్టెలు తినేస్తాలే మిగిలే ఉదయం తిందువుగాని పో" అంటాడు. బుర్ర గోక్కుంటూ వెళ్ళిపోతాడు సూరిగాడు. వాడు అయ్యగారింట్లో ఏదో తినేవస్తాడు కదా అని వాడివంతు బియ్యం తగ్గించి వండుతుంది ప్రతిపూటా వాడి అమ్మ పైడమ్మ.

మరి కాస్త అన్నం పెట్టమని అడిగితే "ఎదవా. అక్కడ తిని మళ్ళీ ఇక్కడ దేవిరిస్తాడు. లెగు సెల్లెళ్ళకుండాల'' అని పిడికెడు అన్నం గరిటెడు పులుసుతో లేవనెత్తిస్తుంది సూరిగాణ్ణి. అందుకే సూరిగాడు వరాలు రాకముందే అయ్యగారు రొట్టెలు తినెయ్యాల అని ప్రతి రోజూ దేవుడికి మొక్కుకుంటాడు. ఐదు గంటలకే డబ్బాలో గోధుమ పిండి ఐదు రొట్టెలకు సరిపడా పిసికేస్తాడు. బంగాళ దుంపలు, ఉల్లిపాయలూ, కూర మసాలా నూరి వండేస్తాడు. రొట్టెలు కాల్చి వేడిగా ఉన్నాయి తినెయ్యండయ్యగారూ! అని పాంచజన్యరావుని తొందర చేస్తాడు అసలు పాంచజన్యరావు ఇంటికిరావడమే ఎనిమిది అవుతుంది. రాగానే బ్రాందీ నాలుగు ఔన్సులు తాగి మేకలా మిక్చెరు నమిలి తినేస్తాడు పొట్లాలు విప్పుకుని.

సూరిగాడి తండ్రి రాజన్న ఆఫీసులో నౌకరుగా చేస్తున్నాడు. ఆఫీసు ఫైళ్ళతో పాటు రెండు మిక్చెరు పొట్లాలు కూడా తెచ్చి టేబిలు మీద పెడతాడు రాజన్న. అసలు పాంచజన్యరావు ఆ వూరు వచ్చినప్పుడు అతనికి అన్ని సదుపాయాలూ అతనిమనస్సెరిగి సమకూర్చిందిరాజన్నే. తన కొడుకుని అతని దగ్గర వంటకి కుదిర్చి జీతమేమిటి కావాల ? అని పాంచజన్యరావుఅడిగినప్పుడు చేతులు నలుముకుంటూ మునిమునిగా మీసాల చాటున నవ్వుకుంటూ జీతమెందుకండి మీ దయ అన్నాడు రాజన్న.

వయస్సులో చిన్నవాడయినా తెలివయినవాడు సూరిగాడు.

ఉదయం అయ్యగారికని రెండు




కప్పులు, తనకని ఓ కప్పు మొత్తం మూడు కప్పులు టీ కలుపుతాడు సూరిగాడు. టిఫిను ఉప్మా చేస్తాడు. అదీ ఇద్దరికే. వేడనీళ్ళు కాచి పాంచజన్యరావు స్నానానికిస్తాడు. రోజూ ఉప్మాయేనా టిఫిను అని పాంచజన్యరావు విసుక్కుంటే "ఏంటి చెయ్యమన్నారు సార్"-అడుగుతాడు సూరిగాడు. అన్ని టిఫిన్లూ వాడికి చెయ్యడం వాడికి చాతయినట్లు.

ఓసారి వాడలా ప్రశ్నించినప్పుడు నవ్వుతూ పాంచజన్యరావు చెప్పాడు పెసరట్టు అని.

"రేపుచేస్తానుసార్ లేపోతేరాత్రిటిఫిను పెసరట్టు చెయ్యమన్నారా ?" అడిగాడు,

"పెసర పప్పు, ఉల్లిపాయలూ అవీ తేవాలసార్" అన్నాడు సూరిగాడు

పదిరూపాయల కాగితం టేబిలు మీద పడేశాడు పాంచజన్యరావు.

నిజం చెప్పాలంటే పాంచజన్యరావు పదిసంవత్సరాలయి భార్యని పిల్లల చదువనే నెపంతో మరో ఊర్లో కాపరం పెట్టించి జీవితం ఎంజాయ్ చేస్తున్నాడు. భార్యకి జీతం డబ్బుల్లో తన తిండిఖర్చుకని కొంత ఉంచుకొని లెక్కలు చెప్పి మిగతా డబ్బు మేస్తాడు సత్యహరిశ్చంద్రుడిలా. ఆమె పట్నంలో ఆ డబ్బుతో జాగ్రత్తగా కాలక్షేపంచేస్తుంది. పని మనిషి చాకలికర్చులు భరించడం కష్టమని ఆ డబ్బులుంటేపిల్లలకి ఏదన్నా ఖర్చుకు పనికివస్తాయని వాళ్ళుచేసే రెండు పనులూ తనే చేస్తుంది.

పాంచజన్యరావు మాత్రం పైలా పచ్చీసు జీవితం గడిపేస్తున్నాడు అతను అతను బాగా లంచంతింటాడని తెలివైన వాడనీ అందరూ అనుకుంటారు. అతనికి పదులు ఐదులు ఒక లెక్కలోనివి కావు తనకోసం ఖర్చుపెట్టుకోవడానికి.

పదిరూపాయల కాగితం చేతి నంచి

తీసుకుని ఈల వేసుకుంటూ బజారు వైపు పరుగు తీశాడు సూరిగాడు.

తిరిగి సూరిగాడిచ్చిన డబ్బులులెక్క పెట్టుకోలేదు పాంచజన్యరావు. పావలా అర్ధా మిగుల్చుకునే తిరిగి డబ్బు లిస్తాడు సూరిగాడెప్పుడూ. వాడికి తెల్సు అతను లెక్కలడగడని.

"మీ అయ్యా!" అని ఊపిరి పీల్చి వదిలాడు పాంచజన్యరావు. అతనలాగ గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడంటే ఏదో చెయ్యబోతున్నాడనే గుర్తు.

ఆ రాత్రి మామూలుగానే వరాలు వచ్చింది. ఎంతో కాలంగా దూరమయి పోయిన ప్రేయసినిలా, సూరిగాణ్ణి వెళ్లు వెళ్లు అని మెడమీదచెయ్యేసి అవతలకి నెట్టేసి, గబాల్న తలుపులు మూసి, వరాల్ని కావలించుకున్నాడు పాంచజన్యరావు.

o o o o

అయ్యిందీ. అనేశాడు కాని ఆలోచనలో పడ్డాడు సూరిగాడు. ఓవేళ పాంచజన్యరావు నువ్వు నా భార్యతో ఫలానా విషయం చెప్పావట నీ కొడకు చెప్పాడు అని అంటే అమ్మో ఇంకేమన్నా ఉందా, అయ్యదొక్క వలిచేస్తాడు.

తానేమిటి చెప్పాడు అమ్మగారితో, పైడమ్మ పెట్టిన అన్నం తినేసి వంచన నులక మంచంమీద వెల్లకిలా పడుకుని గుర్తు తెచ్చుకుంటున్నాడు సూరిగాడు.

పాంచజన్యరావు భార్య పుట్టినరోజు.

"ఏమిటిలా చెప్పాచెయ్యకుండా వచ్చేశావు?" అని భార్యని నవ్వుతూ పలకరించి "ఒరె సూరిగా అమ్మాగారికి స్నానానికి వేన్నీళ్ళుపెట్టు" అని సూరిగాడికి చెప్పి, కాఫీ తాగు అంటూ ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో వంచి ఆమెకు ఆప్యాయంగా అందించాడు పాంచజన్యరావు.

ఆమె వచ్చినందుకు అతనికి ఇబ్బంది కలిగినా, కృత్రిమ పు నవ్వుముఖాన పులుముకుని ఆమె రాకకు తనెంతో సంతోషిస్తున్నట్టు అభినయించేస్తాడతను. ఆమె స్నానంచేసి చీరపిండి సూరిగాడికి ఆరెయ్యమని ఇచ్చేసింది.

నీరు ఆరవేసి వచ్చి "అమ్మగోరూ నన్ను వంట చెయ్యమన్నారా? మీరు నేను కుంటరా" అడిగాడు సూరిగాడు.

"చేసుకుంటాలే" అని తాను తెచ్చుకున్న సూట్‌కేసు తెరిచి రెండుసిక్కర్లు చొక్కాలు సూరిగాడికిస్తూ, "బాగున్నాయా? తొడుక్కుంటావా?" అడిగిందావిడ.

"రాజా నేను ఆఫీసుకోసారి వెళ్ళి తొందరలావచ్చేస్తాలే ఉంటావుకదూ" అని వెళ్ళిపోయాడు పాంచజన్యరావు!

చొక్కాలు సిక్కర్లు చూసుకుని ఉబ్బితబ్బిబ్బయిపోయాడు సూరిగాడు.

"అయ్యగారికి ఎన్నిబియ్యం పెడతావు సూరీ." అడిగింది అమ్మగారు వంటచేస్తూ


"నరిపడినన్నంది." అన్నాడు సూరిగాడు.

"అంటే?"

"అడొక్కందికదండి దానికి ఎల్తిగానండి." దొక్కన్నర పెడుతున్నానని చెబిదే తను తినేసున్నాడని అమ్మగారను కుంటుందని జాగ్రత్తగా చెప్పాడు!

"ఊహూ-సాయంత్రం రొట్టెలు ఎన్ని వేస్తావు?"

"అయ్యగారు రెండు రొట్టెలే కదండీ తింటారు. ఉదయం టీ. సరిగా రెండు కప్పులండీ అదిగో కుండకాడ గ్లాసుంది




కదండి దానితో నీళ్లెడితేసాలండి"

"నువ్వు తాగవా?"

"మిగిలితేనండి"

"ఉహూ, ఒరే ఈసారి వచ్చినపుడు ఇంకో రెండు చొక్కాలు తెస్తాను సరి పోయాయో లేదో తొడుక్కునిచూడు" అందావిడ.

సంబరంగా తొడుక్కుని టేబుల్ మీదున్న అద్దం తీసుకెళ్ళి గడపలోనిల్చుని మొఖం చక్కా చూసుకొంటూ "బాగున్నాయమ్మగారు సరిగ్గా సరిపోయాయి" అన్నాడు సూరిగాడు.

"ఒరె సూరిగా ఆ పాలు తెచ్చిన పిల్ల మంచిదేనా అలా ముస్తాబవుతుంది!" మామూలుమాటలా అడిగింది పాంచజన్యరావు భార్య రాజేశ్వరమ్మ.

"ఉహూ మంచిదికాదండి" అనేశాడు. అసలు వరాలంటే వాడికికోపం. అయ్యగారి దగ్గర డబ్బులుచ్చుకోవటమే కాకుండా అతను తినగా మిగిలిన రొట్టెలు తినేస్తుంటుంది ఒక్కోసారి.

"అయ్యగారితో మాట్లాడుతుందేమిట్రా?" నవ్వుతూ అడిగింది రాజేశ్వరమ్మ

"అలాటియ్యి నేను చెప్పగూడదండి రోజూ రాత్రేళ ఇక్కడేపడుకుంటాదండి."

అమ్మగారి ముఖంలో రంగులు మారిపోయాయి. గ్రహించలేదు సూరిగాడు. "నేనుచెప్పినట్టు మాఅయ్యకేమీ తెలీకోడదండి,"

ఇంకా ఏంచెప్పాడో జ్ఞాపకం రాలేదు సూరిగాడికి.

అమ్మగారూ అయ్యగారూ తనపన్లోకి వచ్చేసరికి ఏమిటో వాదించుకున్నట్లు తగువులుపడ్డట్టు ఎడమొగంపెడమొగంగా కనిపించారు. వాడు పట్టించుకోలేదు.

ఏదోగొడవచ్చింది. అయ్యగారి మీద అమ్మగారికేదో అనుమానం వచ్చింది. గొడవ పడ్డారు. నేనేదోచెప్పాననీ అయ్యగారికి అనుమానం వచ్చింది. కొట్టాడు. అయ్యగారు అమ్మని అడుగుతే! అయ్యని

## వాడినకలం

ఈ మనుషుల మనసులు మార్చాలనీ
ఏదో వ్రాయాలనీ
మానవత్వమనే కలం తీసుకుని
హృదయమనే సిరాలో ముంచి
వ్రాయ ప్రయత్నించి
అది విఫలమని గ్రహించిన
నా వదనం వాడిపోయింది
నా హృదయం మూగవోయింది

**చైతా కృష్ణకుమారి**
10వ తరగతి

అడగదు అనుకున్నా డెందుకో సూరిగాడు.

తనను అయ్యగారు కొట్టిన సంగతి చెప్పలేదు వాడు

ం ం ం ం

రాజయ్య తన గురించి తన భార్యతో చెప్పాడా? అసలు వరాల్ని తనీ ఊరు వచ్చిన నాలుగో రోజు తన అవసరాలు కని పెట్టిన రాజన్న ఆరాత్రి తను నిద్ర పట్టక విసిగి పోతూంటే "మీరు కావాలంటే ఓ పిల్లుందండి" అని తన మొహంలోకి చూసి నసిగాడు.

"అదే నోయ్ చెబుదామను కుంటున్నాను" అని అతని చేతిలో రెండ రూపాయలు పెట్టాడు. గంట తర్వాత వరాలు వచ్చింది తన గదికి.


అతను చెబుతాడా? సూరిగాడే చెప్పి ఉండాలి, రేపు వెధవకి మరో నాలుగు తగల్నిస్తే వాడే చెబతాడు అనుకున్నాడు పాంచజన్యరావు. దాన్ని ముట్టుకుంటే భార్య ఆమె మాటలూ గుర్తు వచ్చాయి. అతని మనస్సంతా ఖరాబయి పోయింది. వరాల్ని వంట్లో బాగోలేదు పొమ్మన్నాడు. రాజేశ్వరి ఎన్ని మాటలంది? "నీకు ఏళ్ళు వచ్చాయి కానీ బుద్ధిరా" లేదంది. "నేనక్కడ పిల్లల్తో ఓటి ఉంటే ఒకటి లేక గడుపు కుంటూ ఉంటే నువ్విక్కడ వెలావచ్చినుగా బతికేస్తున్నావంది. నా ఉసురు నా పిల్లల ఉసురు నీకు తగులుంది". అవమానంతో మండి పోయిన రాజేశ్వరి హద్దులు మీరి మాట్లాడింది. నిన్నేంచేస్తానో చూడన్నట్లు బస్సులోంచి, రోడ్డుమీద అన్ని చివాట్లు తిని వెట్టి వెధవలా నిల్చున్న తనవైపు నిప్పులు కురిపించింది కళ్ళలోంచి, ఆమె చూపుల్లో చూపులు కలప లేక ముఖం పక్కకు తిప్పుకున్నాడు తను.

ఇంతటితో ఆగదు. రాజేశ్వరి హెడ్డాఫీసులో పని చేస్తున్న అన్నకు చెబుతుంది. అతను తనకు బుద్ధి ఎలాచెప్పాలా అని ఆలోచించి ఏదో చేస్తాడు, సూరిగాడ్ని తొక్క ఒలిచెయ్యాలి అనుకున్నాడు పాంచజన్యరావు"

తెల్లవారుతూనే వచ్చి చెడ్డీ ఎగ దోసుకుంటూ స్టౌ వెలిగించ బోతూన్న సూరిగాణ్ణి "ఒరె సూరిగా!" పిలిచాడు పాంచజన్యరావు

అతని గొంతులోని కోపం ధ్వనించిన తీరుకే, భయం భయంగా అతని దగ్గర కెళ్లాడు సూరిగాడు

"నిజం చెప్పెయ్ నిన్నేను కొట్టనూ తిట్టనూ. అమ్మగారితో ఏం చెప్పావ్?" అడిగాడు వీలయినంత సౌమ్యాన్ని గొంతులోకి తెచ్చుకుంటూ పాంచజన్య




రావు.

"ఏటీ చెప్పలేదండి" అన్నాడు సూరిగాడు గొంతు వణుకుతూ ఉంటే.

"వెధవా!" గర్జించి మంచం మీద పడుకున్నవాడల్లా లేచి కూర్చున్నాడు పాంచజన్యరావు.

మళ్ళీ అతను తనని తన్నకుండా, త్వరత్వరగా ఆలోచించిన సూరిగాడు, "డిమానేష్టేగారి బార్య అమ్మగారున్నప్పుడువస్తూంటారు కదండి" అన్నాడు.

"డిమాన్‌స్ట్రేటరు భార్య చెప్పిందంటావా? వెధవా చంపెయ్య గలను. నిన్న మీ అయ్య ఇవాళ ఆవిడ రేపు ఇంకోమాట అంటావ్ రాస్కెల్'' లేచి నిల్చున్నాడు పాంచజన్యరావు.

"నిజమండి ఆవిడే చెప్పంటారండి!"

చెయ్యెత్తాడు పాంచజన్యరావు.

"నేను ఇన్నానండి." అన్నాడు సూరిగాడు.

"ఏమిటి విన్నావు?" చెయ్యిదించి వాడిముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"మరండి మరేమోనండి" బుర్ర గోక్కున్నాడు సూరిగాడు.

"మరి! చెప్పు ఏమిటి చెప్పింది నువ్వేమిటి విన్నావు"

"మరిసిపోయానండి"

సూరిగాడి చెంప ఛళ్ళుమంది.

చెంపకి చెయ్యి చేర్చుకుని "మీరు తాగుతారనండి" అన్నాడు సూరిగాడు.

"వెళ్లు కాఫీ పెట్టు" అన్నాడు పాంచజన్యరావు ఆజ్ఞాపిస్తూన్నట్టు.

టీ కాచాడుగాని వాడికేదో భయంగా పాంచజన్యరావు యముడిలా అనిపిస్తున్నాడు.

"వెధవా పంచదార వెయ్యలేదు" అన్నాడు పాంచజన్యరావు.

చెమ్చా పంచదారతీసి అతనికప్పులో

కలిపే సూరిగాణ్ణి మరోపద్ధతిలో అడిగాడు పాంచజన్యరావు "ఒరె సూరీ. నిజం చెప్పావంటే నీకు పదిరూపాయ లిస్తాను. నువు అమ్మగారికి చెప్పినా ఫర్వాలేదు సిన్నేమీ అనను. నీకింకా కొత్త నిక్కరు చొక్కా స్కూలు పిల్లలకు కుట్టించాం చూశావా? ఓ జత ఇప్పిస్తాను". అడిగాడు అననయంగా.

"నే నెప్పుడూ నిజమే చెబుతానండి అన్న లబద్ధాలాడితే మా అమ్మే వప్పుకోరండి" అన్నాడు సూరిగాడు.

"అవును నిజమే చెప్పు మీ అయ్యకి డిమాన్ స్ట్రేటరు భార్యా, నువ్వా, ఎవరు చెప్పారు?"

"గుమస్తా గుర్నాదంగారి బార్యండి"

"ఏమిటి చెప్పింది! ఎప్పుడు మా ఇంటికి వచ్చింది"

"మొన్నండి. మరండి మరండి "

"మరి?"

"మీరు తాగుతారు, పేకాడతారు, గుడ్లు అయ్యా బెడ్డులో మంచి తినేత్తారు. మరి మరి వరాల్ని మీరుంచుకున్నారంట. అది రంగు రంగుల కోకలయ్యి కొనుక్కుంటున్నదంట"

"ఇవన్నీ ఎవరన్నారు?" అనసహనంగా అడిగాడు పాంచజన్యరావు

"అందరనుకుంటున్నారండి"

"అమ్మగారితో చెప్పిందెవరు?"

"గుర్నాదంగారి బార్యే అయ్యుంట దండి ఆవిడే అందరితో తగువులాడతా ఉంటుందండి".

వాడి జవాబులకి ఇంక నిజం వాడి నంచి రాబట్టలేననుకున్న పాంచజన్యరావు మీ అయ్యకి చెబుతానండు నీ పని అని ఊరుకున్నాడు.

సూరిగాడు వంటచేస్తూ దారాలమ్మ తల్లికి మొక్కుకున్నాడు. "ఈ అయ్యగారికి నెల తిరిగేసరికి ట్రాన్సవరు అయిపోతే నీకు కొబ్బరికాయ కొడతాను. మళ్ళీ అమ్మగారు ఈ ఊరు రాకూడదు. తప్పక నా కోరిక తీర్చు తల్లీ" అని.

ఆరాత్రి సూరిగాడికి వళ్లు తెలియని జ్వరం వచ్చింది. జ్వరంతో కలవరించాడు "నేనేటీ అమ్మగారికి సెప్పలేదు కొట్టకండయ్యగారూ!" అని.

రాజన్న కనుబొమ్మలు ముడిపడ్డాయి. రాజన్న మంచిగా ఉంటే ఎంత మంచి మనిషో ఎవరితోనన్నా విరోధమొచ్చిందంటే అతనంత చెడ్డవాడు మరొకడుండడు.

మర్నాడు ఉదయం రాజన్న వెళ్లాడు పాంచజన్యరావింటికి. "మావోడికి జొరం ఒచ్చిందండి." అని చెప్పి "ఆడిమీదేమన్నా చెయ్యిచేసుకున్నారేంటండి?" అడిగాడు పాంచజన్యరావుని.

రాజన్న ముఖం అతను తనవైపు చూసే నిర్లక్ష్యమైన చూపులు అతని వైఖరీ ఒకేసారిగా మారిపోవడంతో పాంచజన్యరావు రాజన్న తన నేమల్లరి పెడతాడా అనీ భయపడి మళ్ళీ సర్దుకుని "లేదోయ్ వాణ్ణెందుకు కొడతానూ! జ్వరమా! డాక్టరికి చూపించావా? డబ్బు లేమన్నా కావాలేమిటి?" అడిగాడు

"ఓ ఏబయ్యివ్వించండి" అన్నాడు రాజన్న పీసాలచాటున నవ్వుకుంటూ.

"పాలికరూపాయలున్నాయి తీసుకో" అని రెండు పదులు ఒక ఐదుకాగితాలు ఇచ్చాడు పాంచజన్యరావు. రాజన్న అప్పుని దర్జాగా అడిగి తీసుకుపోవటమే కాని ఎప్పుడూ తిరిగి ఇచ్చినపాపాన పోలేదు. వాళ్ళిద్దరిమధ్యా ఉన్న మొహమాటమది. గట్టిగా డబ్బు యిచ్చి బాకీ తీర్చు అని అడగలేదు పాంచజన్యరావు.

సూరిగాడికి జ్వరం తగ్గటానికి నాలుగు రోజులు పట్టింది.

నెల తిరిగేసరికి పాంచజన్యరావుకి ట్రాన్స్‌ఫరయిపోయింది

"అయ్యా కొబ్బరికాయ కొంటాను డబ్బులియ్యవా?" అడిగాడు సూరిగాడు. "ఎందుకు?" అడిగాడు రాజన్న

"దారాలమ్మకి కొట్టాల" అన్నాడు సూరిగాడు.

'జ్వరంలో మొక్కుకున్నాడుకావాల' స్వగతంలో అనుకుని రెండు రూపాయల కాయితం సూరిగాడికిచ్చాడు రాజన్న.

మేనేజరుకి సెండాఫ్‌పార్టీ యిచ్చిన రోజు గుసగుసలాడుకున్నారు ఆఫీసు స్టాఫ్ బావమరిది కావాలని చేయించాడీ ట్రాన్సుఫరు, ఇతని కృష్ణలీలలు తెలిసుంటాయని.

కొబ్బరికాయ కొని దారాలమ్మ గుడివైపు నడిచాడు సూరిగాడు. ★


100 ml బాటిలు కొని

87 పైసలు ఆదా చేసుకోండి

'క్రివేణి' ఇంకు

ఇప్పుడు లాభకరమైన ప్యాకింగులో
100ml పాలిథీన్ బాటిల్సులో దొరుకుతున్నది.
100ml బాటిలు 1కి వెల రు. 2-80
60ml బాటిలు 1కి వెల రు. 2-20
(స్థానిక పన్నులు అదనం)
వినియోగదార్ల లాభమునకుగాను ప్రకటించుచున్నాము.




తయారుచేయువారు :
కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ
751, తిరువత్తియూరు హైరోడ్, మద్రాసు-600081